# ఏటి కడుపున దాగి....

ఆమె గురించి రాయకపోవడం వల్ల ఎవరికీ ఏమీ నష్టం లేదు. చలనంలేని నీటిలో వేసిన గులకరాయి లేపే తరంగాలు ఎంతసేపు ఉంటాయి? బహుశా అంతేనేమో ఆమె జీవితం—

కోరికతో జీవితమంతా పెనుగులాడి, అవకాశం కోసం అర్రులు జాచి, మృత్యువు ఒళ్లో ప్రశాంతంగా "సేదదేరిన వ్యక్తిని తల్చుకొన్నప్పుడల్లా ఆ సుఖానికీ, ఈర్ష్యే కలుగుతుంది".

ఆ కళ్ళల్లో నగ్నతేజస్సు, ఆ భుజం వంపులో సౌకుమార్యం తప్పిస్తే ఆమె గురించి ఏమీ తెలీదు నాకు. అదొక్కటే నాకు తృప్తి. కాని ఒక్కటి మాత్రం తెలుసు. ఒకేసారి ఆమెను దగ్గరగా చూచినా అగ్ని శిఖలా మెరిసే ఆ కళ్ళూ, ఎర్రటి కెంపురంగు చీరె, కళ్లల్లో ఎర్రటి ఆశ్చర్యం,

కంఠంలో అవధుల్లేని తీపి.

"నదిలాగ నా మనసు కదలి పోతున్నాది.

వదలిపోబోకురా, పదివేల దణ్ణాలు"

పాట అక్కడకు వచ్చినప్పుడల్లా వినిపించేది.

రాత్రి ఆ చెరువు దగ్గరికి ఎప్పుడు వెళ్ళినా నీళ్ళుకూడా పాదాల్ని తాకేచోట వెయ్యి శబ్దాలుగా విడి ఇదేపాట పృచ్ఛిస్తూన్నట్టు వినిపించేది.

ఆరు దాటాక ఆ ప్రాంతంలో దీపం కన్పించదు. దట్టంగా దూరాన తాటితోపు.

ఓ చిన్న డింగీ పడవను ఆపడానికి అటువేపు చిన్నమెట్టు. చీకట్లోకి కళ్ళు జొనిపి జాగ్రత్తగా పరికిస్తే ఎర్రటి చీరకొంగు గుర్తు తెలిసేది.

అటువేపు ఏం మాట్లాడినా చెవిలో పిలిచినట్టు ప్రతిధ్వనించేది.

పేరు తెలీదు. ఓరోజు "వదిలి పోబోకురా పదివేల దణ్ణాలు" అంటే ఉలిక్కిపడి చూశాను. సాయంకాలపు మసక వెలుగులో అదురుపాటు చెరువు అవతలి గట్టుకు తెలుస్తుందా ఎక్కడన్నా! కాని ఆమె పోలిక పట్టింది, నేను ఇటు తిరగ్గానే ఒకటే నవ్వు.

చీకటి కడుపులో నవ్వు సుడులు తిరిగి శబ్దం రెట్టింపవుతోంది. ఏదో పక్షి వింతశబ్దం చేస్తూ అరుస్తోంది. ఇంకా జాగ్రత్తగా చూస్తే కొంగు ఆడిస్తూ నన్నే పిలుస్తున్నట్టుంది.

నివ్వెరపోయి నిలబడితే చిన్న డింగీ ముందుకురావడం తెలిసింది. అంతా యాదృచ్ఛికమేమో మరి.

ఆ నవ్వు ఇంకా గుండెల్ని కోస్తోంది. తాటితోపులోంచి ఏదో పేరు తెలీని పిట్ట గుసగుసలాడుతోంది. కళ్ళు కదిపితే నీళ్ళు గలగలలు ప్రతిధ్వనిస్తున్నాయి. డింగీ దగ్గరకు వస్తున్న కొలదీ మల్లెపువ్వుల పచ్చివాసన గుప్పుమంటోంది. "నదిలాగు నా మనసు కదిలిపోతుండాది" అంటోంది దూరంనుంచి. చేతి దూరంలోకి డింగీ వచ్చింది. ఎక్కాలనిగితే బావుణ్ను, తలెత్తితే ఇంకా చీరకొంగు గాలిలో ఎగురుతున్న జాడ కన్పిస్తోంది. మల్లెలు నాకేదో అనుభవం ఇవ్వగలమన్న హామీ ఇస్తున్నట్టున్నాయి. నీటికింద ఏదో కాలిని కొరికినట్టయింది. ఒళ్ళంతా ఒక్కసారి చలితో వణికింది. కిందికి వంగబోతే డింగీ కాళ్ళదగ్గర ఇరుక్కుని ఆగింది.

యౌవనాన్ని అనుభవానికి వదిలి తృప్తిలో సొమ్మసిల్లిన యువతి అనుభూతికి చిహ్నాల్లాగ మిగిలాయి మల్లెలు.

క్షణం అలానే నిలబడి మల్లెల్ని మాత్రం తీసుకుని, డింగీని తోసేశాను. తొందరగా గాలివాలులో అటువేపు కొట్టుకుపోయింది. నీటిలోంచి ఒడ్డుకువస్తే కాలిప్రక్క కప్ప బెకబెకలాడింది. ఇంకా అటువేపు పాట తెలుస్తూనే ఉంది.

* * * * *

పదిరోజుల్తరవాత ఆ నవ్వుకోసం మనస్సు తపనపడితే ఒడ్డున పడి ఎదురు చూశాను. ఎక్కడా విన్పించదు. గాలి హోరులో తాటితోపంతా చీకటి నిశ్శబ్దంతో కలిసి రోదిస్తున్నట్టుంది. చవితి చంద్రుడి గుడ్డి వెలుగు ఏటికడుపులో ముఖం చూసుకొంటోంది. ప్రక్క మామిడితోటలోంచి చిలక కేరుమంటోంది.

"ఏటి కడుపున దాగి

తోట నిదురోయింది"

ఒడ్డుకి వచ్చి చూసుకొంటే నాకు తెలీకుండానే నీటికి సగం పంచె తడిసిపోయింది. ఆమె పేరేదయి ఉంటుందా అని ఆలోచిస్తున్నాను. ఇటు తిరిగితే తడిసిన పంచె కొంగును

పిండుతూ కన్పించింది.

"చెరువు మంచిది కాదు. మిమ్మల్నీ తడిపేస్తుంది. మెలకువగా ఉండండి" అంది.

ఆ కళ్ళు శరీరాన్ని దాటి ఎక్కడికో పోతున్నాయి. దిగ్భ్రమతో స్తబ్దుణ్ణయితే "ఆనాడు రాలేదేం? మల్లెపువ్వులు నష్టపోయాను నేను" అంది.

శరీరానికేం సంబంధం లేనట్లు తడిసినంత మేర పంచెను నేలమీద పరచింది.

మాటలేవీ దొరకడం లేదు నాకు. ఏం చేస్తుందా అని చూశాను. దూరంగా పోయి రాయి మీద కూచుంది. అంతలో నేను చూడడం గమనించి నవ్వేసింది.

"నాకు మాట్టాడ్డం ఎలాగో తెలీదు. నీటివేపు చూడండి" ఇటు తిరిగేసరికి రాయిమీంచి రాయిమీదకి దాటుతూ దూరంగా పారిపోతుంది.

"వదిలిపోబోకురా

పదివేల దణ్ణాలు"

అటు ఒడ్డునుండి ఎవరో గట్టిగా పిలుస్తున్నారు. గొంతుక బొంగురయి స్పష్టంగా తెలీడం లేదు. "క..." అన్న అక్షరం తెలిసింది.

రాయి మీద గెంతుతున్నదల్లా ఆగిపోయింది. డింగీ ఇటువేపే వస్తోంది. చీరెకొంగు తలచుట్టూ తిప్పుకుని చేతులు కట్టుకు నిలబడింది. గాలిలో కొంగు తెరచాపలా ఎగురుతోంది.

డింగీలోకి ఒక్క గెంతు గెంతితే సౌందర్యపు బరువును మోయలేక చెరువంతా వణికింది. నీటి గలగలకు మించి నవ్వు – నన్ను పిల్చినట్టయింది. నా పిరికితనాన్ని, ఆశ్చర్యాన్నీ చూసి హేళన చేస్తోందేమో!

పక్కకి తిరిగితే పంచె ఇంకా తడిగానే ఉంది. రెండు మల్లెపూలు ఆమె జడలోంచి తెగి పడ్డట్టున్నాయి.

పేరేమయి ఉంటుందా అనుకొన్నాను, కామిని, కనకం, కరుణ ... ...

పది అడుగులు దాటి వెనక్కి తిర్గితే ఎవరో ఆమెకు చెయ్యి అందించి డింగీలోంచి దింపుతున్నారు.

ఆకాశం నల్లటి మేఘపునీడ చెరువులో ప్రతిబింబించింది.

* * * * *

ఆరోజు నాకు బాగా జ్ఞాపకం. వర్షంపడి బాగా వెలిసిన రాత్రి నడిఝాము తర్వాత అటువేపు వచ్చాను.

ప్రకృతి సౌకుమార్యాన్ని చెరిచిన తృప్తిని అనుభవిస్తూ సజల నయనాలతో తిరిగే మేఘాల విశ్రాంతి మధ్య చీకటి దిగులుగా మాగన్ను పెట్టినట్లుంది.

తాటితోపులో చీకటి గుబులు భయం కల్గించేదిగా ఉంది.

ఏటిపక్క రాళ్ళన్నీ తడిసి నాచుతో పచ్చబడ్డాయి.

కూర్చోడానికి చెయ్యి ఆనించబోతే కీచురాయి చేతిని కొరికింది.

చీకటి నలుపులో దూరాన కొండ తపస్సు చేస్తున్న ఋషిలా ఉంది.

రాతిమీద కూచొంటే ఆ రాత్రి చల్లదనానికి శరీరం సళ్ళిచ్చింది. గాలి బరువు శరీరాన్ని మత్తుగా చుంబిస్తున్నట్టుంది. తెలీకుండా కళ్ళు బరువుగా మూతపడినయ్.

మెలకువ వచ్చేసరికి ఏరంతా కలతపడినట్టనిపించింది. కళ్ళిప్పితే డింగీలో ఆమె కన్పించింది.

ఆమెను చూసి లేచి నిలబడ్డాను. ఆ అలికిడికి డింగీలోంచి దిగుతున్నదల్లా చీరెకొంగు అడ్డుపడి నీటిలో పడింది. దగ్గరికి వెళ్ళి చేతికి చెయ్యి అందించబోతే దిగ్భ్రమతో చూసింది.

అప్పటి కళ్ళలో ఆశ్చర్యం, అంత చీకటిలోనూ వాటి ఎరుపూ కదిలించింది.

లేవబోతే నా చేతికింద ఆమె గుండ్రటి భుజం వణికింది.

"వదిలెయ్యండి నన్ను" అంది బలహీనంగా.

"ఏం?" అందామంటే నరాలు తిరుగుబాటు చేస్తున్నాయి.

"పారిపోవాలి – నాగురించేం చెప్పకండి" అంటూంది ఆతృతగా.

సిగలో మల్లెపువ్వులు నీటిలోపడి తేలుతున్నాయి. భుజం వదలకుండానే వంగి తీయబోతే చెయ్యి తప్పించుకొంది.

"ఇదిగో, పేరు చెప్పు పోనీ"

పారిపోబోయినదల్లా నిర్ఘాంతపోయి వెనక్కు తిరిగి అంతలో ఏడ్చేసింది, భయంతో శరీరమంతా కంపిస్తోంది.

"ఇష్టంలేకపోతే చెప్పకు"

క్షణం ఆగి "కనకాంబరం" అని పరిగెత్తుతోంది.

మల్లెపువ్వులు ఒసిలి నీరు కారుతున్నయి. ఇటు తిరిగేలోగా బలమైన వ్యక్తి ఈదుకుంటూ వచ్చేడు.

తడిసిన బట్టల్ని ఒగరుస్తూ పిండుకుంటూ "ఎవరది?" అన్నాడు.

ఆ కండల వంపు చూసేసరికి భయమేసింది.

"అదిటే పరుగెత్తిందా?"

"తెలీదు"

కోపం వచ్చి భుజంమీద చెయ్యేసేడు. చెయ్యి చల్లదనానికి లాల్చీ తడిసింది.

"నిజం చెప్పు" అని గర్జిస్తున్నాడు.

క్షణం అతని ముఖం చూసి "ఆమె కన్పిస్తే ఈ పువ్వులు పడిపోయాయని ఇవ్వు" అని నడిచి వచ్చేశాను.

వెనక నుంచి ఉప్పెనలా నవ్వుతున్నాడు.

* * * * *

ఆ తర్వాత మరిక కనకాంబరాన్ని చూడలేదు. మరి పదిహేను రోజుల దర్వాత కాబోలు రాత్రి అటువస్తూంటే డింగీ తేలికగా నదిలో తచ్చాడుతూ కన్పించింది. కనకాంబరం గురించి ఆలోచించడం వ్యసనంలా తయారయింది. ఓసారి కన్పిస్తే బావుణ్ణనిపించింది. రాయి మీద కూర్చోవాలనిపించక మునగచెట్టుకు ఆనుకు నిలబడ్డాను. డింగీ ఇంకా తేలుతూనే ఉంది.

పురుగు ఏదో మెడమీద పాకి కరిచింది.

నది అవతలంతా నిశ్శబ్దంగా ఉంది. ఎర్రటి చీరె కన్పిస్తుందా అని కన్పించే మేరకు నది పరిసరాల్ని కళ్ళు వెదుక్కున్నాయి.

గంట స్తంభం నిశ్శబ్దం గుండెమీద రెండు కొట్టింది.

ఒక్కసారి భయమేసింది.

తిరిగి వెళ్ళిపోబోతే ఉన్నట్టుండి మల్లెపువ్వుల వాసన గుప్పుమనేసరికి ఆశలో ఇటు తిరిగాను. డింగీ రెండు రాళ్ళమధ్యలో ఇరుక్కొని గుంజాటన పడుతోంది. దగ్గరికివెళ్ళి తప్పించబోతే పూలవాసన ఎక్కువయింది. హఠాత్తుగా డింగీలో ఎవరో ఉన్నారేమోనన్న అనుమానం భయపెట్టింది. చీకట్లో ఏమీ కన్పించడంలేదు. చేతితో తడిమితే ఎవరిదో ముఖం. చెక్కిళ్లు చేతికి తగిలాయి. వాటి నునుపు, సౌకుమార్యం గుండెను కదిలించింది. వెంటనే అగ్గిపుల్ల వెలిగించి భీతితో కెవ్వున అరిచాను.

అంతవరకూ రక్తాన్ని అంత దగ్గరగా చూడలేదు నేను. కనకాంబరం మెడ రక్తంతో గీతగీసినట్టు, అగ్గిపుల్ల వెలుగులో జాజ్వల్యమయింది. భయంతో, ఆశ్చర్యంతో శరీరం కొరకొరలాడింది.

మల్లెపూలు రక్తాన్ని పూసుకు ఎర్రబడి పాత సువాసనని తల్చుకు ఏడుస్తున్నట్టు న్నాయి. శాశ్వతంగా, ప్రశాంతమైన నిద్రకు ఉపక్రమిస్తున్నట్టు స్తిమితంగా పడుకొంది కనకాంబరం.

వణుకు తగ్గడం లేదు. రక్తం అంటని ఒక్కపువ్వుని ఆమె గుండె మీంచి తీసుకున్నాను. పువ్వు ఎంతో బరువై నా చేతుల్ని కిందికి లాగేస్తున్నట్టనిపించింది.

నడిస్తే కాళ్ళు వణికి, వశం తప్పుతాయేమోనని భయంతో పరుగెత్తాను.

* * * * *

మర్నాడు అంతా గుంపులు గుంపులుగా చేరి కథలు చెప్పుకున్నారు. "ఏటి ఒడ్డున కనకాంబరాన్ని ఎవరో చంపేశారు" అని.

ఒకర్ని అడిగాను. కనకాంబరం ఎవరని? జవాబు విని మనస్సు కలుక్కుమంది.

"బజారు మనిషి!"

---